క్లుప్తంగా

క్రీడలతో దేహ దారుఢ్యం



గుడ్లవల్లేరు: విద్యార్థులకు క్రీడలతో దేహ దారుఢ్యం ఏర్పడుతుందని అంగలూరు, గుడ్లవల్లేరు గ్రంథాలయాధికారులు పి.వి.వి.పద్మజ, వాణి పేర్కొన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు చెస్, క్యారమ్స్, కుర్చీలాట, ఖోఖో తదితర ఆటల పోటీలతో పాటు చిత్ర లేఖనం పోటీలను నిర్వహించారు.

స్వామి వారి ఆదాయం రూ. 4.71 లక్షలు



గుడివాడ టౌన్: స్థానిక మెయిన్ రోడ్‌లోని శ్రీ విఘ్నేశ్వర స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు సోమవారం జరిగింది. రూ.4,71,048 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వై. శ్రీనివాస్ తెలిపారు. ఇది మూడు నెలల 16 రోజులలో భక్తులు సమర్పించిన కానుకలు అని పేర్కొన్నారు. కార్యక్రమంలో తనిఖీ అధికారి సుధాకర్, ఉత్సవ కమిటీ సభ్యులు ఎస్. రాజేష్, సిబ్బంది మురళి, నారాయణ పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుడు దత్తాత్రేయులు మృతి



గుడివాడ టౌన్: గుడివాడ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.దత్తాత్రేయులు(70) ఆదివారం రాత్రి మృతిచెందారు. హైదరాబాద్‌లో ఆయన గుండెపోటుతో మృతిచెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సోమవారం ఆయన భౌతికకాయాన్ని గుడివాడలోని రాజేంద్రనగర్‌కు తరలించగా సాయంత్రం అంత్యక్రియలు జరిగాయి. దత్తాత్రేయ మృతిపట్ల బీజేపీ నాయకులు రామినేని వెంకటకృష్ణ, పీసీసీ సభ్యుడు ధనేకుల మురళి, డీసీసీ అధ్యక్షుడు వింత సంజీవరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, నాయకులు మండలి హనుమంతరావు, కొల్లిపర సాయి, బంటుమిల్లి సూర్య నారాయణ తదితరులు నివాళులర్పించారు.

రేపటి నుంచి ఆంజనేయుడి తిరుకల్యాణోత్సవాలు

ముదినేపల్లి రూరల్: స్థానిక కైకలూరు రోడ్డులోని సువర్చలా సమేత భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఈ నెల 21 నుంచి 25వ తేదీ వరకు తిరుకల్యాణోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆర్యవైశ్య సంఘం మండల నాయకులు తెలిపారు. ఇందుకు సంబంధించి తగిన ఏర్పాట్లు చేసినట్లు సంఘం అధ్యక్షుడు మాడుగుల పూర్ణచంద్రరావు పేర్కొన్నారు.

వెంకటేశుని సన్నిధిలో సామూహిక కుంకుమ పూజ



పెదసనగల్లు(మొవ్వ): మొవ్వ మండలం పెదసనగల్లు శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులుగా సాగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం మహిళలు సామూహిక కుంకుమ పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. వేద పండితులు దీవి ఉదయకుమార అయ్యంగార్ ఆధ్వర్యంలో దేవస్థాన అర్చకులు అగ్నిహోత్రం శ్రీనివాసాచార్యులు పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

పేదలకు భోజన ప్యాకెట్ల పంపిణీ

కైకలూరు: యాచకులు, యానాదులు, పారిశుద్ధ్య కార్మికులు 100 మందికి గొంతు పులుగు సంధ్య సోమవారం భోజన ప్యాకెట్లు పంపిణీ చేశారు. రైల్వేస్టేషన్, బస్టాండ్, గాంధీబొమ్మ సెంటర్‌లో వీటిని అందించారు. ఆమె దాతృత్వాన్ని కుటుంబ సభ్యులు, స్నేహితులు అభినందించారు.

ఉద్యోగులు, పెన్షనర్లను విస్మరించిన ప్రభుత్వం

గుడివాడ టౌన్: గత ఎన్నికల్లో ఉద్యోగులు, పెన్షనర్లకు అనేక హామీలు ఇచ్చిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటిని పూర్తిగా విస్మరించిందని ఉద్యోగులు, పెన్షనర్లు విభాగం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అధ్యక్షుడు టి.వి.రమణకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులకు అన్ని రకాల బకాయిలు రూ. 30 వేల కోట్లు ఉండగా బడ్జెట్‌లో కేవలం రూ 7,300 కోట్లు కేటాయించారని పేర్కొన్నారు. ఆర్థిక ఇబ్బందులంటూ కాలయాపన చేస్తున్నారు కాని ఉద్యోగుల సంగతి పట్టించుకోవడం లేదని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఒక్క రూపాయి కూడా ఆర్థిక ప్రయోజనం ఉద్యోగులు పొందలేక పోయారన్నారు. పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

అప్రోచ్ రోడ్లు నిర్మించేది ఎప్పుడో?



వీరంకి వద్ద నిరుపయోగంగా ఉన్న బందరు కాలువపై నిర్మించిన వంతెన

నిరుపయోగంగా మారిన వంతెనలు

పమిడిముక్కల: రూ.లక్షల వ్యయంతో కాలువలపై నిర్మించిన వంతెనలకు ఇరువైపులా అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేయలేదు. దీంతో ఆ వంతెనలు నిరుపయోగంగా మారాయి. మండలంలోని మేడూరు శివారు ధూళిపూడిపాలెం వద్ద కన్నెకలమడుగుపై ఉన్న వంతెన శిథిలావస్థకు చేరింది. ఈ వంతెనకు కొద్ది దూరంలో ఏడేళ్ల క్రితం కొత్త వంతెన నిర్మించారు. వంతెన నిర్మాణ సమయంలో పిల్లర్ ఒరిగిపోవడంతో సరిచేసి నిర్మాణం పూర్తి చేశారు. వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేయలేదు. దీంతో వంతెనపై నుంచి రాకపోకలకు అవకాశం లేకుండా పోయింది. ఏళ్ల తరబడి వంతెన నిరుపయోగంగానే మిగిలిపోయింది. శిథిలావస్థకు చేరిన పాత వంతెన పైనుంచే గ్రామస్తులు రాకపోకలు సాగిస్తున్నారు. పాత వంతెనకు మరమ్మతులు చేపట్టాలని, కొత్త వంతెనను వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

వీరంకి వంతెన కూడా అంతే..

వీరంకి వద్ద బందరు కాలువపై నిర్మించిన వంతెన ఏడేళ్లుగా నిరుపయోగంగానే ఉంది. పడవలు వెళ్లేందుకు వీలుగా డిజైన్ చేసి వంతెన ఎత్తు పెంచి నిర్మించారు. దీంతో వంతెనకు ఇరువైపులా అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేయడం వీలుకాలేదు. వీరంకి గ్రామస్తులకు బందరు కాలువ అవతల వైపున పొలాలున్నాయి. పొలాలకు పడవపై కాలువదాటి వెళ్లేవారు. కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు పడవ ప్రయాణం ప్రమాదకరంగా ఉండేది. గ్రామస్తుల కోరిక మేరకు వంతెన నిర్మాణం ప్రారంభించారు. వంతెన పనులు జరుగుతుండగానే కాలువకు నీరు రావడంతో సైడ్ వాల్ పక్కకు ఒరిగిపోయింది. వంతెన నిర్మాణం పూర్తి చేసి అప్రోచ్‌లు ఏర్పాటు చేయకపోవడంతో నిరుపయోగంగా ఉంది. వంతెన డిజైన్ మార్చి ఎత్తు తగ్గిస్తే తప్ప ఈ వంతెన వినియోగంలోకి వచ్చే అవకాశం లేదు. కాగా వంతెన సమస్య ఇరిగేషన్ ఉన్నతాధికారుల దృష్టిలో ఉందని అధికారులు తెలిపారు.



నిరుపయోగంగా ఉన్న ధూళిపూడిపాలెం కన్నెకలమడుగుపై ఉన్న వంతెన

వాహనాలు తిరిగేందుకు వీలులేకుండా వంతెన



ధూళిపూడిపాలెం వద్ద కన్నెకలమడుగుపై నిర్మించిన వంతెన వాహనాలు తిరిగేందుకు వీలుగా లేదు. పాత వంతెన ముందు భాగంలో కట్టాల్సి వంతెనను వెనుక వైపున కట్టారు. వంతెన నిర్మాణంలో నాణ్యత లోపించింది. ఈ వంతెన కట్టినా ఉపయోగం లేదు. అప్రోచ్‌లు ఏర్పాటు చేసి వినియోగంలోకి తీసుకురావాలి.

– గంజాల గోవిందరాజులు, ముత్రాసిపాలెం

పాత వంతెనకు మరమ్మతులు చేపట్టండి



ధూళిపూడిపాలెం వద్ద కన్నెకలమడుగుపై ఉన్న పాత వంతెన పూర్తిగా దెబ్బతింది. కొత్త వంతెన నిరుపయోగంగా మారడంతో ఈ వంతెన పైనుంచే రాకపోకలు సాగుతున్నాయి. వంతెనకు మరమ్మతులు చేపట్టాలి.

– సూరిశెట్టి ఏడుకొండలు, ముత్రాసిపాలెం

వీరంకి వంతెనకు మోక్షమెప్పుడో?



వీరంకి వంతెన సమస్యను ఇరిగేషన్ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. ఏళ్ల తరబడి నిరుపయోగంగానే ఉంది. వంతెన డిజైన్ మార్చి ఎత్తు తగ్గించి వినియోగంలోకి తీసుకురావాలి.

– కాసాని వేదసుప్రజ, ఎంపీపీ, వీరంకి

అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేయాలి



కాలువ దాటి పొలాలకు వెళ్లాలంటే ఇబ్బందిగా ఉంది. గతంలో పడవలపై వెళ్లేవాళ్లం. వంతెన కట్టినా ఉపయోగం లేకుండా పోయింది. అప్రోచ్ రోడ్లు ఏర్పాటు చేసి రాకపోకలకు అవకాశం కల్పించాలి.

– ఉయ్యూరు నరసింహారావు, వీరంకి

కుయుక్తులతో కైకలూరు వైస్ ఎంపీపీ-1 కూటమి వశం



ఆర్డీఓకు వైఎస్సార్ సీపీ విప్ పత్రాలను అందిస్తున్న ఎంపీటీసీ లక్ష్మి, చిత్రంలో డీఎన్నార్ కుమారుడు వినయ్



వైస్ ఎంపీపీ ఎన్నికలకు హాజరైన వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ సభ్యులు

విప్ జారీతో న్యాయపోరాటం చేస్తామంటున్న వైఎస్సార్ సీపీ నేతలు

కైకలూరు: ఒకే ఒక్క టీడీపీ ఎంపీటీసీ ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం కుయుక్తులతో కైకలూరు మండలం వైస్ ఎంపీపీ-1ను కైవసం చేసుకుంది. మండల పరిషత్ మీటింగ్ హాల్లో వైస్ ఎంపీపీ ఎన్నిక సోమవారం జరిగింది. ఈ ఏడాది మార్చిలో వైఎస్సార్ సీపీకి చెందిన వైస్ ఎంపీపీ-1 మహమ్మద్ జహీర్ రాజీనామా చేయడంతో ప్రస్తుతం ఎన్నిక అనివార్యమైంది. వైఎస్సార్ సీపీకి చెందిన ఎనిమిది మంది ఎంపీటీసీలు హాజరయ్యారు. రాచపట్నం వైఎస్సార్ సీపీ ఎంపీటీసీ ఈదా కృష్ణవేణి, పల్లెవాడ ఎంపీటీసీ బంటుమిల్లి సాదు కొండయ్యను వైస్ ఎంపీపీగా ప్రకటించగా కొండయ్యకు ఏడుగురు వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు మద్దతు తెలిపారు. కూటమి పార్టీలో ఎంపీపీ అడవి కృష్ణ తామరకొల్లు టీడీపీ ఎంపీటీసీ గంగుల వెంకటనరసమ్మ పేరును ప్రతిపాదించగా తొమ్మిది మంది మద్దతు తెలిపారు. దీంతో వెంకట నరసమ్మను వైస్ ఎంపీపీగా ప్రకటించారు. ఎన్నికల పరిశీలకులుగా జేసీ పి.ధాత్రిరెడ్డి, ఎన్నికల అధికారిగా ఏలూరు ఆర్డీఓ అంబరీష్ వ్యవహరించారు. విజేతను ట్రావెలర్స్ బంగ్లా వద్ద ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అభినందించారు.

వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలకు విప్ జారీ

వైఎస్సార్ సీపీ గుర్తుతో ఎంపీటీసీలుగా విజయం సాధించి ఇతర పార్టీల్లో చేరటంపై వైఎస్సార్ సీపీ ఆటపాక-2 ఎంపీటీసీ తమ్మిశెట్టి లక్ష్మితో కలసి వైఎస్సార్ సీపీ మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) కుమారుడు దూలం వినయ్‌కుమార్ కైకలూరు కార్యాలయంలో ఆర్డీఓ అచ్యుత అంబరీష్‌కు విప్ పత్రాలను అందించారు. మొత్తం 18 మంది వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలకు కొందరికీ నేరుగా, మరికొందరికి వాళ్ల ఇళ్ల వద్ద నోటీసుల ద్వారా విప్ పత్రాలను అందించామని పేర్కొన్నారు. నామినేషన్ల సమయంలో అందించే అఫిడవిట్‌లో అభ్యర్థులు పూర్తి వివరాలను నమోదు చేస్తారు. విప్ ద్వారా పార్టీ సిద్ధాంతాలను పాటించని వారిని అధికారం నుంచి బర్తరఫ్ చేసే అవకాశం విప్‌తో లభిస్తోంది. త్వరలో తమ సభ్యత్వాలు రద్దు అవుతాయనే భయం ఇప్పటికే కొందరి సభ్యులకు పట్టుకుంది.

తెలుగు మీడియంలో బోధన కొనసాగించాలి

కైకలూరు: సెకండరీ పాఠశాల వరకు విద్యను ప్రభుత్వం మాతృభాషలోనే బోధన కొనసాగించాలని డెమోక్రటిక్ పీఆర్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీవీఎస్ రామాంజనేయులు డిమాండ్ చేశారు. కై కలూరులో సోమవారం ఆయన మాట్లాడుతూ తమిళం, కన్నడం, ఒడియా వంటి ఇతర భాషల మాధ్యమాలు వారి మాతృభాషలో కొనసాగుతున్నప్పుడు మనం కొనసాగించలేకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పునరాలోచన చేయాలని డిమాండ్ చేశారు.

విజయవాడ బస్సు కోసం పడిగాపులు



గుడ్లవల్లేరు బస్టాండ్‌లో విజయవాడ బస్సు కోసం ప్రయాణికులు పడిగాపులు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు నుంచి విజయవాడ కాశేశ్వరరావు మార్కెట్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సుల కోసం ప్రయాణికులు పడిగాపులు పడుతున్నారు. విజయవాడకు ఒక్క గుడ్లవల్లేరు నుంచే గాక డోకిపర్రు, వడ్లమన్నాడు నుంచి కూడా డైలీ ఆర్టీసీ సర్వీసు బస్సులు ఉన్నాయి. ఆయా గ్రామాల నుంచే గాక మార్గమధ్యంలో అనేక గ్రామాల ప్రజలు ఆర్టీసీ బస్సులు రెండేసి గంటలు, మూడేసి గంటలు ఆలస్యంగా రావటంతో ప్రయాణికులు పడిగాపులు పడుతూ.. మండుటెండలో అగచాట్లకు గురవుతున్నారు. కనీసం ఆ ఆర్టీసీ బస్సుల సమాచారం కోసం గూగుల్‌లో ఏర్పాటు చేసిన ట్రాక్‌ను కూడా ప్రయాణికులు చూసుకోవడానికి లేకుండా ఆర్టీసీ సిబ్బంది తొలగించారని వాపోతున్నారు. కనీసం తమకు రావాల్సిన బస్సు ఎంత దూరం వచ్చిందో చూసుకునే అవకాశం కూడా లేకుండా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్సులు నిర్ణీత సమయానికి రాక పోవటంతో ఎండకు తాళలేక ప్రయాణికులు అధిక చార్జీలను వెచ్చించుకుని ఆటోలను ఆశ్రయిస్తున్నారు. ఇప్పటికైనా విజయవాడకు వెళ్లే ఆర్టీసీ డైలీ సర్వీసు బస్సులను నిర్ణీత సమయానికి పంపించేందుకు ఆర్టీసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

యోగాతో రుగ్మతలు దూరం

జమీగొల్వేపల్లి(పామర్రు): ప్రతిరోజూ యోగా చేస్తే శారీరక రుగ్మతలు మాయం అవుతాయని ప్రముఖ యోగా గురువు పాట్లూరి వెంకట ధర్మారావు పేర్కొన్నారు. మండలంలోని జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో సోమవారం యోగాపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనంద, ఆరోగ్యమయ జీవనానికి యోగా ఉపకరిస్తుందని తెలిపారు. నిత్య జీవితంలో యోగా ఒక భాగం కావాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి నాగసురేష్ పాల్గొన్నారు.

పామర్రులో..

స్థానిక ద్వితీయశ్రేణి గ్రంథాలయంలో వేసవి శిక్షణలో భాగంగా విద్యార్థులకు సోమవారం పాటల పోటీలను నిర్వహించినట్లు గ్రంథాలయ అధికారి ఎం.ఝాన్సీరాణి తెలిపారు.

విద్యార్థులకు నీతి కథల బోధన

మండవల్లి: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా సోమవారం మండవల్లి శాఖా గ్రంథాలయంలో విద్యార్థులతో లైబ్రేరియన్ ఎస్‌కే పర్వీన నీతికథలు చదివించారు. ఆమె మాట్లాడుతూ వేసవి విజ్ఞాన శిబిరాలను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.



జమీగొల్వేపల్లిలో ఆసనాలు వేస్తున్న విద్యార్థులు

గణితంపై ప్రత్యేక శిక్షణ

ముదినేపల్లి రూరల్: స్థానిక గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు సోమవారం లెక్కలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయాధికారి ఎం.శ్రీదేవి ఆధ్వర్యంలో ప్రాథమిక విద్యార్థులకు కూడికలు, తీసివేతలు తెలియజేయడంతో పాటు ఎక్కాలు వల్లెవేయించారు. అనంతరం విద్యార్థులకు ఇండోర్ గేమ్స్ నిర్వహించారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు



సీఐలు, ఎస్‌ఐలతో కార్డెన్‌సెర్చ్‌లో పాల్గొన్న డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడ డీఎస్పీ ధీరజ్ వినీల్

గుడివాడరూరల్: గుడివాడ సబ్ డివిజన్‌లో శాంతి భద్రతలకు ఎవరైనా విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గుడివాడ డీఎస్పీ వి.ధీరజ్ వినీల్ హెచ్చరించారు. మల్లాయపాలెం పరిధిలో ఉన్న టిడ్కో సముదాయంలో సోమవారం తెల్లవారుజామున సబ్ డివిజన్‌లోని సీఐలు, ఎస్‌ఐలతో కార్డెన్‌సెర్చ్ కార్యక్రమాన్ని డీఎస్పీ చేపట్టారు. ఈ సెర్చ్‌లో ఎటువంటి పత్రాలు లేని 29 బైక్‌లు, కారు, ఆటోలను స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ టిడ్కో సముదాయంలో శాంతి భద్రతలకు పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారన్నారు. అదేవిధంగా సబ్ డివిజన్‌లో గంజాయి విక్రయాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. జూదాలు కూడా ఎక్కడా జరగనివ్వకుండా ఇప్పటికే చర్యలు చేపట్టామని తెలిపారు. ఎక్కడైనా గంజాయి అమ్మకాలు జరిగినా, జూదాలు నిర్వహించినా ఆయా ప్రాంతాల్లోని ప్రజలు వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో గుడివాడ తాలూకా, వన్,టూటౌన్ సీఐలు ఎస్‌ఎల్‌ఆర్ సోమేశ్వరరావు, కొండపల్లి శ్రీనివాస్, చిన్ని నాగప్రసాద్, తాలూకా ఎస్‌ఐ ఎన్.చంటిబాబు, సబ్ డివిజన్‌లోని ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఎండీయూ ఆపరేటర్ తీరుపై ఫిర్యాదు

పామర్రు: పామర్రు ఎండీయూ ఆపరేటర్-4 కె సురేంద్ర రేషన్ వినియోగదారులపై అనుచితంగా ప్రవర్తిస్తున్న తీరుపై స్థానిక తహసీల్దార్ కార్యాలయంలోని ప్రజా స్పందనలో బాధితురాలు సోమవారం అర్జీని సమర్పించారు. బాధితురాలి కథనం మేరకు స్థానిక అరండాల్ పేటలో నివాసం ఉంటున్న నూకల ఇందిరకు రేషన్‌కార్డు ఉంది. వృద్ధాప్యంతోటు కాలు విరగడంతో మంచానికి పరిమితం అయింది. బయటకు రాలేని పరిస్థితిలో ఉన్న ఆమెకు రేషన్ ఇవ్వాల్సిన ఎండీయూ ఆపరేటర్ ఏడు నెలల పాటు బియ్యం ఇవ్వలేదు. ఈ విషయాన్ని గతంలో తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లగా ఈ ఏడాది ఏప్రిల్‌లో వేలిముద్ర వేయించుకుని రేషన్ ఇచ్చారు. మే నెలలో వేలి ముద్రలు వేయించుకుని రేషన్ ఇవ్వాలని పలుమార్లు కోరినా.. ఇప్పుడు కుదరదని ఎండీయూ తెలిపి, 'నేను నీ దగ్గరకు రావాల్సిన అవసరం లేదు. అధికారులు నన్ను ఏమీ చేయలేరు' అని సమాధానం ఇచ్చాడు. గతంలో కూడా మంగంద రత్న మాణిక్యం అనే మహిళ ఈ ఎండీయూపై ఫిర్యాదు చేయటం విశేషం. ఆమెకు కూడా రేషన్ ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేశాడు. ఈ విషయమై తహసీల్దార్ జీ రవికాంత్ మాట్లాడుతూ ఎండీయూ పై విచారణ చేపట్టి తగు చర్యలు తీసుకుని వృద్ధురాలికి ప్రతి నెలా బియ్యం ఇచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ రామారావు, ఐకేపీ ఏపీఎం తిరుపతయ్య పాల్గొన్నారు.



పామర్రులో అర్జీలను స్వీకరిస్తున్న తహసీల్దార్

పుచ్చలపల్లి సుందరయ్యకు ఘన నివాళి

గుడివాడ టౌన్: సీపీఎం నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఆ పార్టీ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రజా సేవకు తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప నాయకుడు సుందరయ్య అని, ప్రజల పక్షాన చివరి గడియల వరకు పోరాడిన ప్రజా నాయకుడు అని సీపీఎం నాయకులు పేర్కొన్నారు. సీపీఎం నాయకుడు ఆర్‌సీపీ రెడ్డి, బందారు రాధాకృష్ణ, ఆంజనేయులు, గాంధీ పాల్గొన్నారు.

మొవ్వలో..

మొవ్వ: కమ్యూనిస్ట్ నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి సందర్భంగా మొవ్వ మండలంలోని నిడుమోలు, కాజ, చినముత్తేవి గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో సీపీఎం నాయకులు పాల్గొని ఆయన చిత్రపటాలకు నివాళులర్పించారు. ఆయా గ్రామాల్లో నిర్వహించిన కార్యక్రమాల్లో సీపీఎం మండల కార్యదర్శి శీలం నారాయణరావు, మద్దుల బసవరావు, ఉప్పలపు వెంకటాద్రి, కొడాలి కరుణాకర్ రావు, మాదాసు నాగులు, కాకి రాజశేఖర్, పి శాంసన్, సీహెచ్ సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో..

పామర్రు: స్థానిక సీపీఎం కార్యాలయంలో కార్యదర్శి ఓ గంగాధరప్రసాద్ అధ్యక్షతన సీపీఎం నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని సోమవారం నిర్వహించారు. నాయకులు అల్లాడి రాజా, ముళ్లపూడి విల్సన్, కాటూరి నాగ భూషణం, కె లక్ష్మణ, డి రఘునాధరావు, సిరికి వెంకటేశ్వరరావు, ఆదిశేషు తదితరులు పాల్గొన్నారు.



గుడివాడలో సుందరయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

కలిదిండిలో..

కలిదిండి (కైకలూరు): సీపీఎం నాయకుడు పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కలిదిండి మండలంలో పోతుమర్రు, భాస్కరరావుపేట, మూలలంక గ్రామాల్లో సీపీఎం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం ఏలూరు జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళి రావు, ప్రజా సంఘాల నాయకులు వి.భాస్కరరావు, సీహెచ్.శ్రీకాంత్, బి.రామనాగేంద్రం, జి.అనిల్‌కుమార్, కే.శ్రీనివాసరావు, కే.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ సురేఖ మృతదేహానికి నివాళులు



గుడివాడరూరల్: దొండపాడు గ్రామ సర్పంచ్ చోరగుడి సురేఖ ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై ఆదివారం మృతి చెందిన విషయం విదితమే. సోమవారం దొండపాడులో ఆమె మృతదేహానికి పలు పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు ఘనంగా నివాళులర్పించారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సురేఖ కుటుంబ సభ్యులను ఫోన్‌లో పరామర్శించి ధైర్యం చెప్పారు. కుటుంబ సభ్యులకు తాను అన్ని వేళలా అండగా ఉంటానని తెలిపారు. కుటుంబ సభ్యులు, బంధువులు సురేఖ మృతి చెందడాన్ని తట్టుకోలేక కన్నీరుమున్నీరుగా విలపించారు. నివాళులర్పించిన వారిలో గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గుడివాడ జోన్స్, టీడీపీ నేత జగన్మోహనరావు, పలువురు అధికారులు నివాళులర్పించారు. కాగా సురేఖ భర్త బుజ్జిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాలూకా ఎస్‌ఐ ఎన్.చంటిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేసవిలో ప్రజలను ఇబ్బంది పెట్టొద్దు

గుడ్లవల్లేరు: అప్రకటిత విద్యుత్ కోతలు లేకుండా చూడాలని గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, నెప్రూరా పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు ట్రాన్స్‌కో సిబ్బందిని కోరారు. సోమవారం కొతవరం విద్యుత్ సబ్ స్టేషన్‌కు వెళ్లి విద్యుత్ కోతలను లేకుండా చేయాలని విజ్ఞప్తి చేశారు. వేసవిలో ప్రజలను ఇబ్బంది పెట్టకుండా ఒక విద్యుత్ లైన్ పనులు చేసేటపుడు మరొక లైన్ నుంచి గుడ్లవల్లేరు మండలానికి విద్యుత్ సరఫరా ఇవ్వాలన్నారు. సంత కమిటీ డైరెక్టర్లు వల్లభనేని కృష్ణప్రసాద్, పోలవరపు వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతతో జనం ఇక్కట్లు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరులో అప్రకటిత విద్యుత్ కోతతో జనం ఇక్కట్లకు గురయ్యారు. ఆదివారం రాత్రి నుంచి సోమవారం వేకువజాము వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయడంతో ప్రజలు అల్లాడిపోయారు. కాగా కొత్త విద్యుత్ లైన్ల ఏర్పాటు కారణంగా ఈ అప్రకటిత విద్యుత్ కోత ఏర్పడిందని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.

పుష్కరాలకు బస్ సౌకర్యం

గుడివాడ టౌన్: కాళేశ్వరం సరస్వతి నది పుష్కరాలకు గుడివాడ ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ డి. రాజేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పుష్కరాలు సందర్భంగా ఈనెల 26వ తేదీ వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. బృందాలుగా ఏర్పడితే బస్సును బృందం వద్దకే పంపుతామని తెలిపారు. సూపర్ లగ్జరీ బస్ చార్జ్ రూ. 2 వేలుగా నిర్ణయించామని పేర్కొన్నారు. యాత్రలో భాగంగా మార్గమధ్యంలో గల ఆలయాలు, పుణ్యక్షేత్రాలైన వరంగల్ కాళీమాత, వేములవాడ రాజరాజేశ్వరీ దేవస్థానం, కొండగుట్ట ఆంజనేయ స్వామి ఆలయం, రామప్ప ఆలయం తదితర పుణ్యక్షేత్రాలు సందర్శనకు ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం నాలుగు గంటలకు బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. మూడో రోజు ఉదయం గుడివాడకు చేరుకుంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు 94947 59318లో సంప్రదించాలని కోరారు.

సంక్షిప్త వార్తలు

సింగలూరుకు తాగునీరు అందించండి

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలం చంద్రాల శివారు సింగలూరుకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని ఆ గ్రామస్తులు సోమవారం ప్రముఖ సంఘ సేవకుడు డాక్టర్ బండారు శ్యామ్‌కుమార్ ఆధ్వర్యంలో తహసీల్దార్ బి.లోకరాజు, ఎంపీడీఓ టి.విజయసారథికి వినతిపత్రాలను అందించారు. తమ గ్రామంలోని మంచినీటి చెరువుకు రక్షణ లేక పశువులు దిగుతున్నాయని తెలిపారు. ఆ చెరువుకు సర్వే చేయించి ఫెన్సింగ్‌ను ఏర్పాటు చేయాలని కోరారు.

చురుగ్గా ఉపాధి పనులు

పామర్రు: మండలంలో ఉపాధి హామీ పనులు చురుగ్గా సాగుతున్నాయని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీఓ సురేష్ పేర్కొన్నారు. జరుగుతున్న పనులను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జమీదగ్గుమిల్లి, పసుమర్రు, నిమ్మకూరు, నెమ్మలూరు తదితర గ్రామాలలో చెరువు పూడిక తీత పనులు, మిగిలిన గ్రామాల్లో పంట బోదెల తవ్వే పనులు జరుగుతున్నాయని తెలిపారు.

25న విగ్రహాల ఆవిష్కరణ

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు వైఎస్సార్ బ్రిడ్జిపై శ్రీకృష్ణ దేవరాయులు, వంగవీటి మోహనరంగా, ఎస్వీ రంగారావు విగ్రహాలను కాపు సంఘ నాయకులు ఏర్పాటు చేశారు. ఈ విగ్రహాలను ఈ నెల 25వ తేదీన సాయంత్రం మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధాకృష్ణ ఆవిష్కరించనున్నట్లు నిర్వాహకులు సోమవారం తెలిపారు.